50వ డివిజన్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 50వ డివిజన్ వైయస్సార్ నగర్ ఆటోస్టాండ్ నుండి ప్రారంభమైన గడవగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన కోలగట్ల కుశల ప్రశ్నలు వేస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా ఉన్నాయని ప్రజాస్పందనను అడిగి తెలుసుకున్నారు. వారి నుండి సంపూర్ణ ఆనందం వ్యక్తం కావడంతో ఆ ప్రాంతమంతా హర్షాతిరేకాలు నిండుకున్నాయి. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అందువల్లనే ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుంది అన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ మాట్లాడుతూ వైయస్సార్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. గతంలో ఇల్లు లేని వారందరికీ వైయస్సార్ నగర్ లో పట్టాలు ఇచ్చి, ఇళ్ళ నిర్మాణాలు చేయడంలో కోలగట్ల కృషి ఎంతో ఉందన్నారు. వైయస్సార్ నగర్ లో మౌలిక సదుపాయాల కల్పనకు కోటి 70 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. 3,500 మందికి గృహ సౌకర్యం కల్పించామన్నారు. ఈ ప్రాంతంలో అద్దెకు ఉన్న పేదలకు గుంకలాంలోనూ,టిడ్కో ఇళ్ల ను మంజూరు చేసామని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజాస్పందన అనూహ్యంగా లభించడం ఆనందంగా ఉందన్నారు. మారుమూల ప్రాంతాలలో సైతం సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అన్ని ప్రాంతంలో అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం సంతోష దాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయా యాదవ్, సహాయ కమిషనర్ ప్రసాదరావు,స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు తోనంగి జగన్నాథరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సామాజిక పింఛన్లు

విశాలాంధ్ర - నెల్లిమర్ల : అర్హులందరికీ సామాజిక పింఛన్లు అందజేస్తున్నట్లు వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ తెలిపారు. నెల్లిమర్ల మండలం కొండగుంపాంలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి అవినీతికి చోటు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఎకౌంట్ లోకే సంక్షేమ పథకాలు డబ్బులు జమచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు పతివాడ అప్పన్న, గుంటమాని ఉమామహేశ్వరరావు, వైస్ సర్పంచులు మీసాల ఆదినారాయణ, మహంతి కృష్ణ, కార్యదర్శి కిరణ్ కుమార్, వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్టు ముమ్మాటికీ కక్ష సాధింపే

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించడం ముమ్మాటికీ కక్ష సాధింపు కోసమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుండాలని, వెంటనే బెయిలు మంజూరు కావాలని గొంప క్రిష్ణ నేతృత్వంలో భారీ సంఖ్యలో మహిళలు, నాయకులు ఎస్.కోటలోని దుర్గాదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గొంప క్రిష్ణ మాట్లాడుతూ అప్పటి చంద్రబాబు ప్రభుత్వ కేబినెట్ ఆమోదం మేరకు ఏర్పాటయిన స్కిల్ డెవలప్మెంట్ సంస్థ వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాల ద్వారా 2.13లక్షల మంది నిరుద్యోగులు శిక్షణ తీసుకుని లబ్ది పొందారని స్పష్టం చేశారు. ఇక అప్పటి అధికారి పీవీ రమేష్ కూడా స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ఏర్పాటులో ఎటువంటి అవినీతి చోటు చేసుకోలేదని, నిరుద్యోగులు శిక్షణ పొందారని, సీమెన్స్ నుండి డిజిటెక్ లో నా నోట్ ఫైల్ అంటూ వైసీపీ ప్రభుత్వం బురద జల్లడం విడ్డూరంగా ఉందని విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారంటే చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమనే విషయం ప్రజలు గుర్తించాలని సూచించారు. అనంతరం మహిళలు, నాయకులు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు, రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు శైలిని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, ఎం.మంగరాజు, ఆదారి రమేష్, ఆదారి ఉమామహేశ్వరరావు, కారుకొండ శ్రీను, సీతంపేట సత్తిబాబు, బంగారునాయుడు, మండా త్రినాథ్, శ్రీనురాజు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి కుటుంబ సభ్యుల మృతి

విశాలాంధ్ర - కొత్తవలస : విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం లో విషాదం చోటు చేసుకుంది. విశాఖ మద్రిపాలెం ఎఫ్సీఐ కాలనీకి చెందిన ఓ కుటుంబం కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామంలోని బావిలో మృతి చెంది మంగళవారం విగత జీవులుగా తేలారు. ఈ ఘటనలో భార్యాభర్తల తో పాటు కుమార్తె మృతి చెందారు. మృతులు ఎండి మోహినుద్దీన్ (46) భార్య సంశనిషా (39) కుమార్తె ఫాతిమా జహీదా (17) గా పోలీసులు గుర్తించారు. వీరు ఓ ప్రైవేటు వాహనములో సోమవారం సాయంత్రం కొత్తవలస సమీపంలోని చింతలపాలెం లో తమ స్థలాన్ని చూసేందుకు వెళ్లారు. అనంతరం అక్కడే బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారా... లేక మరేదైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. విజయనగరం డి.ఎస్.పి జి గోవిందరావు, కొత్తవలస సీఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కుమారుడు మహమ్మద్ ఆలీతోపాటు బంధువులను విచారించినట్లు తెలిపారు. సంఘటనకు సంబంధించి అనుమాన స్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మన్నారు. సిబ్బంది మృతులను బావిలోంచి బయటకు తీసి శవ పంచనామా నిర్వహించి శవ పరీక్షకు ఎస్ కోట ప్రభుత్వ హాస్పిటల్ తరలించారు .

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం కోరన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా చదురు,వనం దేవాలయాల వద్ద ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు .చదురు గుడి వద్ద అమ్మవారికి వేకువ జామునే పంచామృతా భిషేకాలు ఆలయ అర్చకులు ఏడిద వెంకటరమణ నిర్వ హించారు. అనంతరం దేవాలయంలో కుంకుమ పూజలు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి కేఎల్ సుధా రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. అర్చకులు తాతా రాజేష్ శర్మ, పూజారి బంటుపల్లి వెంకట్రావు పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

యువత సేవా స్ఫూర్తి ప్రశంసనీయం

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నేటి యువత సేవా కార్యక్రమాలతో సమాజం పట్ల తమవంతు బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయమని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, వైసీపీ యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో మంగళవారం విజయనగరానికి చెందిన శ్రీ పైడిమాంబ యూత్ సొసైటీ ప్రథమ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజానికి ఉపయోగపడుతూనే.. మరోవైపు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని జీవితంలో బాగా స్థిరపడాలని సూచించారు. చిన్న వయసులోనే సేవా సంస్థను ఏర్పాటు చేసి.. అనాథలకు అన్నదానం, వైద్య, రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, మహిళల అక్రమ రవాణాపై చైతన్యం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్న సొసైటీ ఫౌండర్ ప్రవల్లికను అభినందించారు. సమాజ హితం కోసం పాటుపడుతున్న వీరికి ఎటువంటి అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. లోక్సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ సమాజంలో రీల్ హీరోలను కాక.. రియల్ హీరోలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గురజాడ, ఆదిభట్ల, గిడుగు వంటి వారి చరిత్రను తెలుసుకోవాలన్నారు. అనంతరం వివిధ సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న పలువురిని ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అతిథులను నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదాతలకు ఈశ్వర్ కౌశిక్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

సీతంలో నూతన డాక్టరేట్‌లకు సన్మానం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఆంధ్రా విశ్వ విద్యాలయంలో డాక్టరేట్ పొందిన వారికి యాజమాన్యం చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈనెల 9వ తేదీన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో గణిత శాస్త్ర విభాగంలో జి. శ్రీచందన డాక్టరేట్ డిగ్రీ గవర్నర్ చేతులు మీదుగా అందుకున్నారు. ఈమె గణిత శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ జి.వెంకట రవీంద్రనాథ్‌బాబు మార్గ దర్శకత్వంలో పి.హెచ్. డి పూర్తి చేశారు. అలాగే ఇదే కార్యక్రమంలో ఎస్.సత్యవతి లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ డిగ్రీ గవర్నర్ చేతుల మీద అందుకున్నారు. ఈమె ప్రొఫెసర్ కె.సోమశేఖర్ మార్గదర్శకత్వంలో పి.హెచ్. డి పూర్తి చేశారు. దీనిపై మంగళవారం సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి.శశి భూషణ్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సి.హెచ్. వెంకటలక్ష్మి, ఇతర విభాగా ధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్పార్క్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నందు 1000 మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు డాక్టర్ శ్రీరామ మూర్తి , డాక్టర్. బాల నాగ శ్రీకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజల ఆరోగ్యం కోసం, పర్యావరణ కాలుష్యము నియంత్రణ కోసం అందరూ మట్టి గణపతి విగ్రహాలు వాడాలని సూచించారు.ప్రతి భక్తుడు ప్రకృతి కూడా పూజించి,కాలుష్యకారక రంగు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మల వినియోగం చేయరాదని కోరారు.

వసతి గృహాల ఆధునీకరణకు జిల్లా పరిషత్ నిధులు

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం : ఉమ్మడి జిల్లాల్లో నున్న సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ తదితర వసతి గృహాల లోనున్న వంట గదులు, వంట పాత్రలు విద్యార్థుల భోజనానికి అవసరమగు అన్ని సౌకర్యాలు, సామగ్రిని మార్చడానికి జిల్లా పరిషత్ నుండి నిధులను సమకూర్చ నున్నట్లు జిల్లా పరిషత్ చైర్పర్సన్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం లో 3,5,6 స్టాండింగ్ కమిటీ సమావేశాలు చైర్మన్ ఆధ్వర్యం లో జరిగాయి. ఈ సమావేశం లో వసతి గృహాల సామాగ్రి బాగా పాడై పోయిందని, పెరిగిన విద్యార్థుల సంఖ్యకు ప్రస్తుతం ఉన్న సామగ్రీ సరిపోవడం లేదని సోషల్ వెల్ఫేర్ డి డి చైర్మన్ దృష్టికి తెచ్చారు. చైర్మన్ స్పందిస్తూ రెండు జిల్లాల్లో నున్న అన్ని వసతి గృహాలకు, మహిళా ప్రాంగణం కు , మూగ చెవిటి పిల్లల పాఠశాలకు, అవసరమగు సామాగ్రి కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని, జెడ్ పి నిధుల నుండి లేదా సి.ఎస్.ఆర్ క్రింది కొత్త సామాగ్రి కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌లో అధికారులు, జెడ్.పి.టి.సిలను సభ్యులుగా పర్చేజ్ కమిటీను ఏర్పాటు చేసి ధరలను, నాణ్యతను తనిఖీ చేయాలనీ జెడ్ పి సి.ఈ.ఓ కు సూచించారు. వ్యవసాయ శాఖ చర్చలో భాగంగా ఎరువుల లభ్యత పై వేపాడ జెడ్‌పిటిసి మాట్లాడుతూ డి.ఎ.పి ఆర్.బి.కెలో లేదని తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ అన్ని కాంప్లెక్స్ ఎరువులు ఆర్.బి.కెలలో అందుబాటులో ఉంచాలని, ధరల నియంత్రణ కు టాస్క్ ఫోర్సు కమిటీలను వేసి నిఘా పెట్టాలని వ్యవసాయ శాఖ జె.డి.కి సూచించారు. ఎరువులన్నీ ఆర్.బి.కె లోని కియోస్కో ద్వారానే పంపిణీ చేయాలనీ, అప్పుడు మాత్రమె ప్రభుత్వ సబ్సిడీ వస్తుందని అన్నారు. త్వరగా భవనాలను పూర్తి చేసి ప్రారంభించాలని తెలిపారు. మండలాల్లో జరిగే ప్రతి కార్య క్రమాలకు జెడ్.పి.టి.సి లను తప్పక ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎం.ఎల్.సి డా. సురేష్ బాబు, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ రాజ్ కుమార్, స్థాయీ సంఘాల అధ్యక్షులు బాపు నాయుడు, శాంతికుమారి, సింహాచలం, జెడ్.పి.టి.సిలు, రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

విశాలాంధ్ర - భోగాపురం : భోగాపురం ఉన్నత పాఠశాలలో 1987 సంవత్సరంలో 10 వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు భోగాపురం ఉన్నత పాఠశాలకు ఐరన్ గ్రిల్స్ అందజేశారు. 30000 రూపాయలు విలువ చేసే సేఫ్టీ ఐరన్ గ్రిల్స్ ను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. తమ వంతుగా తాము చదువుకున్న పాఠశాలకు ఈ సహాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముద్దన మురళి కృష్ణ, అడ్డగర్ల శ్రీనివాసరావు,కొండాపు లక్ష్మణ రెడ్డి, సుందర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : పురపాలక అభివృద్ధిపై ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో పురపాలక సంఘంలో ఇంతవరకు ప్రభుత్వం మంజూరు చేసిన 3,200 గృహ నిర్మాణాల ప్రగతిపై పూర్తి నివేదికను సిద్ధం చేసి ఇంకా అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయించాలని మున్సిపల్, హౌసింగ్ అధికారులకు ఆదేశించారు.ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో వార్డు పరిధిలో అభివృద్ధి కొరకై 40 లక్షల రూపాయలు చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం తెలిసినదేనన్నారు. వార్డులలో ప్రజల కోరిక మేరకు ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు సీసీ రోడ్లు, కాలువలు, మంచినీరు కుళాయిలు, కాలువల శానిటేషన్, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు మార్పిడి, కల్వర్టులు నిర్మాణం వంటి అనేక మౌలిక సదుపాయాల అభివృద్ధి కొరకు పనులు ప్రారంభం చేయించడం జరిగింది అని అయితే ఇంకా కొన్ని వార్డులలో ఇప్పటికీ పనులు ప్రారంభం చేయని పరిస్థితి తన దృష్టికి వచ్చిందని, అలానే ఇంకా కొన్ని పనులు అసంపూర్తిగా వదిలేశారని, ఇవి కాకుండా ఇప్పటికీ పూర్తి చేసిన పనులకు బిల్లులు పెండింగ్లో ఉన్న వాటిని వెంటనే క్లియర్ చేయడం వంటి వాటిపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించి వాటికి పరిష్కారం మార్గాలను చూపి అత్యవసరంగా అన్ని పనులు పూర్తి చేసేలా అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను, గుత్తేదారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అదే విధంగా మరో ప్రధాన అభివృద్ధి అంశం అయిన నవరత్నాలు పేదలు అందరికీ ఇల్లు పథకంలో భాగంగా పురపాలక సంఘంలో ఇంతవరకు ప్రభుత్వం మంజూరు చేసిన సుమారుగా 3,200 గృహ నిర్మాణాల ప్రగతిపై పూర్తి నివేదికను సిద్ధం చేసి ఇంకా అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయించాలి అని, పనులు జరుగుతున్న ఇళ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేసేలా చూడాలన్నారు.ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు, హౌసింగ్ డిఈ, వర్క్ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ అధికారులు ఈఈ, డిఈ, ఎమినిటీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు లేకుండా చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : గర్భిణీ స్త్రీలు రక్తహీనతకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. మంగళవారం జనసేన పార్టీ నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, తామరకండి తేజ, కర్రి మణికంఠ, పైలరాజు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పార్వతీపురం జిల్లాలో గర్భిణీ స్త్రీలలో అధికంగా రక్తహీనత కనిపిస్తోందన్నారు.జిల్లా ఆసుపత్రి తో పాటు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవం కోసం జాయిన్ అయ్యే గర్భిణీలలో అధికమందికి రక్తం అవసరం పడుతుందన్నారు. దీనికి రక్తహీనతే కారణమన్నారు. నిరక్షరాస్యులు, నిరుపేదలు అవగాహన లేమితో రక్తహీనతకు లోనవుతున్నారన్నారు. కాబట్టి అటువంటి పరిస్థితులు లేకుండానే సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరారు. అంగన్వాడీల ద్వారా గర్భిణీ స్త్రీలలో రక్తహీనత లేకుండా ఉండేందుకు అమలు చేస్తున్న వైయస్సార్ సంపూర్ణ, వైయస్సార్ ప్లస్ తదితర పథకాలు పక్కాగా వినియోగమయేలా పర్యవేక్షించాలన్నారు. అలాగే వైద్యారోగ్య శాఖ ద్వారా గర్భిణీ స్త్రీలకు రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు అవసరమైన మందులు క్రమం తప్పకుండా అందేలా, వారు వాటిని వాడేలా చర్యలు చేపట్టాలన్నారు. అధికంగా జిల్లాలో గిరిజన గర్భిణీ స్త్రీలు రక్తహీనతకు లోనవుతున్నారన్నారు. వీరిపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరం అన్నారు.

ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం/బెలగాం : ఓటరు పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఓటరు విచారణలో తప్పులు లేని ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందాలని ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో ఓటరు జాబితా తయారీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటింటి ఓటరు విచారణ చేసి శాశ్వతంగా గ్రామాలను వదలిన వారిని, మృతి చెందిన వారిని, డూప్లికేట్ ఎంట్రీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తొలగించే కార్యక్రమం వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ ఓటరు సర్వే విచారణ కార్యక్రమంలో ప్రత్యేక పర్యవేక్షణతో మృతి చెందిన ఓటర్లు, శాశ్వత వలసలు, డబుల్ ఎంట్రీ ఓటర్లు తొలగింపు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఫారం - 8 ని స్వీకరించి పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నామని, నాలుగు రోజుల్లో పూర్తి కాగలదని ఆయన చెప్పారు. ఓటర్ల తొలగింపు ప్రక్రియలో నోటీస్ జారీ, శాశ్వత వలసల ఓటర్లు, మరణించిన ఓటర్ల పంచనామా, వీడియో స్టేట్మెంట్, తదితర అంశాలతో పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటింటి ఓటర్ల పరిశీలన జిల్లాలో దాదాపుగా పూర్తయ్యిందని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరణ చేపట్టి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అర్. గోవిందరావు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు కల్పనా కుమారి, సి. విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకటరావు, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్డీవో కె. హేమలత తదితరులు పాల్గొన్నారు.

పనసభద్ర పంచాయతీలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో సోమవారం మక్కువ మండలంలోని పనసభద్ర పంచాయతీ గ్రామం పరిది ఎర్ర సామెత వలస చిమిడి వలస చెక్కవలస మరియు దుగ్గేరు గడపగడప 192 రోజు ఈ కార్యక్రమం పాల్గొన్నారు గ్రామంలోమన్యం పులి, గిరిజన శాఖామంత్రి శ్రీ పీడిక రాజన్నదొర పాల్గొనడం జరిగింది. మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల్లో భాగంగా ప్రజలకి మేలు చేయాలని దృఢ సంకల్పముతో ఎన్నెన్నో కార్యక్రమాలు అభివృద్ధి పరుస్తున్నారు జగనన్న వస్తే ఇంకెన్ని కార్యక్రమాలు. అభివృద్ధి అవుతది జగన్ కావాలి జగన్ రావాలి అండ్ డిప్యూటీ సీఎం పీడక రాజన్న దొర అన్నారు కార్యక్రమంలో ఎంపీపీ మర్రి మారమ్మ, జెడ్పీటీసీ సభ్యులు శ్రీ మావుడి శ్రీనివాసునాయుడు, వైసీపీ మండల అధ్యక్షులు మావుడి రంగునాయుడు ఎంపీడీవో సూర్యనారాయణ తాసిల్దార్ సూర్యనారాయణ సర్పంచు వైఎస్ఆర్సిపి నాయకుడు సర్పంచ్ సీదరపు.గంగమ్మ గారు, ఎంపీటీసీ సామంతుల వెంకటి గారు,ఎంపీడీఓ సూర్యనారాయణ గారు,ఇతర ప్రజాప్రతినిధులు,వైసీపీ నాయకులు,కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండి జిల్లా ఆసుపత్రిలో ఇహెచ్‌ఎస్ సేవలు

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో బుధవారం నుండి ఉద్యోగ ఆరోగ్య పథకం (ఎంప్లాయీస్ హెల్త్ స్కీం - ఇ.హెచ్.ఎస్) క్రింద వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి. వాగ్దేవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఔట్ పేషెంట్ సేవలు బుధవారం నుండి అందిస్తామని, డిస్పెన్సరీ విధానంలో సేవలు అందుతాయని, ఇందులో కన్సల్టేషన్, డయాగ్నస్టిక్స్, మెడిసిన్ అందించడం జరుగుతుందని, రిఫరల్ సేవలు పైస్థాయి ఆసుపత్రులకు పంపించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. మెడికల్ రీఇంబర్స్‌మెంట్ క్రింద రూ.2 లక్షల విలువ వరకు ప్యాకేజీ అందించుటకు అవకాశం ఉందని అన్నారు. ఇహెచ్ఎస్‌లో సెప్టెంబరు నెలలో ఆయా తేదీలలో వైద్యం అందించే వైద్యుల వివరాలు కూడా సిద్ధం చేశామని చెప్పారు.

దివ్యాంగరాలకు వీల్ చైర్ అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ఇటీవల బలిజిపేట మండల కేంద్రంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మెట్ట వీధి కాలనీకి చెందిన దివ్యాంగరాలైన బొత్స లలిత ఇంటికి వెళ్ళినప్పుడు ఆమెకు రెండు కాళ్ళు లేక ఆమె అటు ఇటు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందిని స్వయానా చూసి చలించిపోయిన ఎమ్మెల్యే జోగారావు స్పందించి నూతన వీల్ చైర్ ను అందజేసారు.తాను అడగకముందే తన సమస్యను చూసి చలించిన ఎమ్మెల్యే వెంటనే నాకు వీల్ చైర్ అందచేయడం చాలా సంతోషంగా ఉందని బొత్స లలిత ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలుపారు.

హౌసింగ్, జిజిఎంపి పనులపై సమీక్ష

విశాలాంధ్ర - సీతానగరం : మండలం లోని 21గ్రామ సచివాలయంలలో జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాలు, సాధారణ ఇళ్ళ నిర్మాణాలు గూర్చి,సచివాలయంలలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులు గూర్చి ఎంపిడిఓ ఎం ఎల్ ఎన్ ప్రసాద్ మంగళవారం సమీక్ష చేశారు. త్వరితగతిన పనులు జరిగేలా సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దృష్టి పెట్టాలని కోరారు. దీంతో పాటు ఆయా సచివాలయంలలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు.

పిల్లల ఆరోగ్యంపై తల్లులు జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - కొమరాడ : పిల్లల ఆరోగ్యంపై తల్లులు జాగ్రత్తలు పాటించాలి డిఐఓ డాక్టర్ జగన్మోహన్రావు పిల్లలకు ఆరోగ్యం పట్ల పూర్తి స్థాయిలో తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి వేయించాలి మంగళవారం మిషన్ ఇంద్ర ధనుష్ రెండో విడత లో బాగంగా గుణానుపురం, అర్తాం గ్రామాల్లో ఆయన డిఐఓ డాక్టర్ జగన్ మోహన్‌రావు పరిశీలించారు . ఈ సందర్భంగా డిఐఓ డాక్టర్ జగన్మోహన్రావు మాట్లాడుతూ సెషన్స్ లో ఎంతమందికి టీకా వేస్తున్నారని సిబ్బందిని ఆరా తీయగా 8 మంది ఐదేళ్ళ లోపు పిల్లలకు, ముగ్గురు గర్భిణీ లకు వేస్తున్నట్లుగా తెలిపారు. మరియు ఈ నెల 11న ప్రారంభమైన మిషన్ ఇంద్ర ధనుష్ రెండో విడత కార్యక్రమం 16 వరకు కొనసాగుతుందని, ఐదేళ్ళ లోపు పిల్లలు ప్రాంతాల వ్యాధులకు గురి కాకుండా, ముఖ్యంగా తట్టు, రుబెల్లా తదితర వ్యాధుల పూర్తి స్థాయిలో నిర్మూలించడం మిషన్ ఇంద్ర ధనుష్ ఉద్దేశ్యం అని అన్నారు. గతంలో ఏవైనా కారణాల వల్ల టీకా వేసుకోని పిల్లలకు, ప్రస్తుత షెడ్యూలు ప్రకారం అర్హులైన పిల్లలు, గర్భిణీ లకు టీకా వేయడం జరుగుతుందన్నారు. ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్స్ నిర్మల, జయగౌడ్, వైద్య సిబ్బంది శ్రావణి, వర్షిణి, రామకృష్ణ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణీలకు భోజనం అందించడం అదృష్టం

జామి పిహెచ్‌సి వైద్యాధికారిణి డా. వనజ

విశాలాంధ్ర - జామి : గర్భిణీలకు ఇంటిలోనే కాకుండా బైటకు వచ్చిన సమయంలోనూ సరైన భోజనం సమయానికి అందాలని, గర్భిణీలకు భోజనం అవసరమైన సమయంలో దాతలు వారికి అందించడం అదృష్టంగా భావించాలని జామి పిహెచ్‌సి వైద్యాధికారిణి డా. వనజ అన్నారు. ప్రతీ నెలా ఆసుపత్రిలో 9వ తేదీన జరిగే గర్భిణీల ఆరోగ్య తనిఖీ కార్యక్రమం వరుససెలవుల కారణంగా సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా తనిఖీకి వచ్చిన 130 మందికి పైగా ఉన్నగర్భిణీలు, వారి సహాయకులకు , సిబ్బందికి జామికి చెందిన రిటైర్డ్ ప్రదానోపాధ్యాయులు చలుమూరి సత్యనారాయణ భోజనం ఏర్పాటు చేసారు. ఈభోజన కార్యక్రమాన్ని డా. వనజ ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రతీనెలా దాతల సహకారం మరువలేనిదని కొనియాడారు. తమకు సహకరిస్తున్నా సామాజిక సేవకుడు నార్లమహంతి నారాయణరావును అభినందించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విన్నకోట సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల బాలింత మృతి

విశాలాంధ్ర - కురుపాం : మండలం లోని గొటివాడ పంచాయతీ బల్లుకోట గ్రామానికి చెందిన రెండు నెలలు గిరిజన బాలింత మృత్యుఒడి చేరింది. బల్లుకోట కి చెందిన కొండగొర్రి. సుశీల(30) రెండు నెలలు క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. గడచిన నెలరోజులుగా విరేచనం అవ్వక తీవ్ర కడుపు నొప్పి తో ఇబ్బంది పడి రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళగా సుఖ విరేచనం అయ్యేందు మందులు ఇచ్చి పంపారు. సమస్య యధాతథంగా ఉండటంతో కుటుంబ సభ్యులు పార్వతీ పురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేసి వైద్యం అందించిన వైద్యులు రిపోర్టులలో ఆరోగ్యం బాగా ఉందని డిస్చార్జి ఇచ్చి ఇంటికి పంపగా సోమవారం రాత్రి ఇంట్లోనే తుదిశ్వాస విడిచింది. భర్త కుమార్,బంధువు లు రెండు నెలలు మగబిడ్డ తో కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.

ద్విచక్ర వాహనం వేలంపాట నిర్వహణ

విశాలాంధ్ర - సీతానగరం : స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం పార్వతీపురం డి.ఎస్పి మురళీధర్ పర్యవేక్షణలో ద్విచక్ర వాహనానికి సంబందించి వేలంపాటను నిర్వహించినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. వాహనాన్ని నియమ నిబంధనలు మేరకు వేలంపాట ద్వారా పాడుకున్నవారికి ఇవ్వడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా డి. ఎస్పీ మురళీధర్ స్టేషను పరిసరాలను పరిశీలించారు. స్టేషను పరిధిలోని కేసుల గూర్చి, సిబ్బంది గూర్చి అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ 30 అమలు, స్టేషన్ పరిధిలో పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితిలో సిబ్బంది పాటించ వలసిన పలు సూచనలు చేశారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

కలెక్టర్ నాగలక్ష్మి



విశాలాంధ్ర - విజయనగరం : ఓటర్ల జాబితా రూపకల్పన, సవరణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్వోలు స్వయంగా వెళ్లి పరిశీలించాలని, అక్కడ పరిస్థితిని, సమస్యలను వివరిస్తూ నివేదిక సమర్పించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా తప్పుడు నివేదికలు ఇచ్చినట్లయితే ఏఈఆర్వోలపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ ఘాటుగా స్పందించారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో ప్రతి అంశమూ చాలా ముఖ్యమని ఎక్కడా చిన్న తప్పు కూడా దొర్లడానికి వీలు లేదని పేర్కొన్నారు. ఒకటికి రెండు సార్లు పరిశీలించి నివేదికలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఇతర అంశాలపై పలు మార్గ నిర్దేశకాలు జారీ చేశారు. ఆయా జిల్లాల్లోని ఓటర్ల జాబితా తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, ఆర్డీవోలు, ఎలక్షన్ సెల్ అధికారులు తదితరులు కార్య క్రమంలో పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ ఓటర్ల జాబితాను రూపొంది ంచాలని, తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఒకే ఇంటి చిరునామాతో పలు ఓట్లు నమోదు అయిన విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన అంశాలకు సంబంధిత ఓటర్ల నుంచి ఫారాలు తీసుకోవాలని పెండింగ్ నివేదికలను నిర్ణీత కాలంలోగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి సరైన పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. ఎన్నికలు, ఓటర్ల జాబితా ప్రక్రియకు సంబంధించి విధుల్లో ఎవరు అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఎవరి పరిధిలో వారు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఫారం -6 ,7, 8కి సంబ ంధించిన అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఏఈఆర్వోలు అందరూ తప్ప కుండా స్వయంగా వెళ్లి పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, అక్కడున్న తాజా పరిస్థితిని వివరిస్తూ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్త కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీసీలో భాగంగా జిల్లాలో చేపట్టిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల కమిషన్ కు జిల్లా కలెక్టర్ వివరించారు. ఓటర్ల జాబితా వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో ఎస్.డి. అనిత, ప్రత్యేక ఉప కలెక్టర్లు దొర, వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు సూర్యకళ, అప్పారావు, విజయనగరం తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

15న జిఎస్‌టి అమలుపై అవగాహనా సదస్సు

విశాలాంధ్ర - జామి : ఈనెల 15వ తేదీన జామి, గంట్యాడ మండలలలో పనిచేస్తున్న చార్టెర్డ్ అకౌంటెంట్స్, ఆడిటర్స్, చాంబర్ ఆఫ్ కామర్స్ టాక్స్ ప్లేయర్స్‌లకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామని వానిజ్య పన్నుల శాఖ ఈస్ట్ సర్కిల్ ఎసి జి. అచ్చయ్య తెలిపారు. ఈసమావేశంలో రాష్ట్రంలో నూతనంగా వచ్చిన జిఎస్‌టిలోని పలు మార్పులపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు హాజరుకావాలని తెలిపారు. 15న సాయంత్రం 4. గంటలకు జామిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి : కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు. నగర పాలక సంస్థ శానిటరీ విభాగంలో కోదూరు లోకేష్, తుపాకుల వెంకటరావు అనే ఇద్దరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తూ, సంబంధిత పత్రాలను మంగళవారం ఆయన అందజేశారు. ఇద్దరికీ పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా నియమించినట్లు ఆయన తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఎం హెచ్ ఓ శ్రీరామ్మూర్తి, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొమరాడ : కొమరాడ మాదలంగి కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద పని చేయుచున్న ఆశ వర్కర్లకు మరియు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు గాను కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలనిబీ! ఉద్యోగ భద్రత కల్పించాలనిబీబీ రాజకీయ వేధింపులు ఆపాలనిబీ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీబీఉపాధి పనులు కల్పించాలని బీబీటిఏడిఏలు ఇవ్వాలని బీబీబీకరోనా వైరస్ వ్యాప్తి చెందే సందర్భంలో మరణించిన ఆశ వర్కర్ల కుటుంబాలకు అన్ని విధాలుగా భరోసా కల్పించాలనిబీ ప్రత్యేకించి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు యూనిఫారం మరియు గడిచిన 21 నెలల జీతాలు తక్షణమే ఇవ్వాలనిబీబీ అలాగే ఆశ వర్కర్లకు మరియు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు గాను పని ఒత్తిడి తగ్గించాలని పై సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు లేదంటే భవిష్యత్తులో జిల్లా కార్యాలయం వద్ద పెద్దయెద్దున ధర్నా నిర్వహిస్తామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో సిఐడి యు నాయకులు కొల్లి సాంబమూర్తి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వంగరకు పూర్తి స్థాయి ఎంపీడీఓ

విశాలాంధ్ర - వంగర : ఎట్టకేలకు వంగరకు పూర్తి స్థాయి ఎంపిడివోనునియమించారు. ఎంపిడివోగా హనుమంత్ శశి బూషన్‌రావును నియమించారు. ఆయన వంగర ఎంపిడివోగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతవరకూ శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండల ఈవో పీఆర్‌డిగా పని చేస్తూపదోన్నతిపై ఇక్కడ ఎంపీడీఓగా విదుల్లో చేరారు.గత రెండున్న రేళ్లుగా ఇంచార్జ్ లతో ఇక్కడ నడుస్తుంది. నేటి నుండి ఈ సమస్యకు తెరవడనుంది.

నేడు పార్వతీపురంలో 'జగనన్నకు చెబుదాం'

విశాలాంధ్ర - పార్వతీపురం : మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం పార్వతీపురంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉంటుందని చెప్పారు. 15వ తేదీన బలిజిపేట, 20న కొమరాడ, 22న మక్కువ, 27న గరుగుబిల్లి, 29న పాలకొండ, అక్టోబరు 4వ తేదీన జియ్యమ్మవలస, 6న వీరఘట్టం, 11న కురుపాం, 13న సీతంపేట, 18న సాలూరు, 20న పాచిపెంట, 25న భామిని, 27న గుమ్మలక్ష్మీపురం మండలాల్లో జరుగుతుందని ఆయన ప్రకటించారు.

బిందు, తుంపర్ల సేద్య విధానం ఎంతో మేలు

ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : బిందు, తుంపర్ల సేద్య విధానం ఎంతో మేలని, తక్కువ నీటి వనరులతో అధిక విస్తీర్ణంలో పంటల సాగు చేపట్టవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ అన్నారు. ఎస్.కోట మండలం, గోపాలపల్లి గ్రామంలో రాయితీపై రైతు మండా జోగారావు మాస్టారు పొలంలో ఏర్పాటు చేసిన బిందు, తుంపర్ల యూనిట్ ను మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి పీడీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న రైతులకు రాయితీపై బిందు, తుంపర్ల యూనిట్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కూరగాయలు, పండ్ల తోటలు, ఇతర పంటలకు నీరు, ఎరువుల సరఫరాను కూడా ఈ యంత్రంతో చేయవచ్చన్నారు. అవసరమైన యంత్ర విడిభాగాలు, పైపులు వంటివి అందుబాటులో ఉన్నాయని పీడీ లక్ష్మీ నారాయణ వివరించారు.

ఉత్సాహంగా మండల స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్



విశాలాంధ్ర - (తెర్లాం)బాడంగి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాడంగిలో మండల విద్యా శాఖ మరియు స్థానిక హెచ్ఎం, పిడి ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు మండల స్థాయి టోర్నమెంట్ మరియు సెలక్షన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సెలక్షన్స్ ఎంఈఓ రాజేశ్వరి, హెచ్ఎం సత్యన్నారాయణ ప్రారంభించారు. ప్రధానంగా పోటీలు వాలీబాల్, కబడ్డీ, ఖో -ఖో, బ్యాడ్మింటన్ బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్,టెన్నికాయిట్, యోగ, అథ్లెటిక్స్ లో జరిగాయి. ఇందులో గెలుపొందిన వారు బొబ్బిలి నియోజకవర్గం స్థాయి ఆటల పోటీల్లో ప్రాతినిత్యం వహిస్తారని పిడి బంగారునాయుడు తెలిపారు. ఈ పోటీలలో కేజీబీవీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, వాడాడ, రేజేరు, కోడూరు,బాడంగి పాఠశాలల నుండి పిడిలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు అందరూ సహకరించండి



విశాలాంధ్ర - వేపాడ : ఈ నెల 15నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు సహకరించాలని ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్ అన్నారు. స్థానిక వైస్సార్ క్రాంతి పథం సమావేశం మందిరంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండాలన్న ప్రభుత్వ సంకల్పానికి మనమంతా అండగా ఉండి సకాలంలో వ్యాధులపై సర్వే జరిపి నివేదిక సిద్ధం చేయాలన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎ ధరణి మాట్లాడుతూ సర్వే పూర్తి అనంతరం ఈ నెల 30వ తేదీనుంచి మండలంలోని 16సచివాలయాల పరిధిలో ఉచిత వైద్యశిభిరాలను నిర్వహించడం జరుగు తుందన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ లు వేర్వేరు బృందాలుగా ఏర్పడి ఈ వైద్యశిభిరాలను పర్యవేక్షిస్తారన్నారు. ఈ వైద్య శిభిరాలలో పెద్ద ఎత్తున విలువైన మందులు, ప్రత్యేక వైద్యనిపుణులు పాల్గొని చికిత్సలు అందిస్తారన్నారు. గ్రామాల వారీగా ఈ నెల 30న రామస్వామిపేట, వచ్చేనెల 3న కొండగంగుబూడి, 4న సోంపురం, 5న పాటూరు, 6న ఆతవ,7న బల్లంకి, 9న బానాది, 10న దబ్బిరాజుపేట, 11న జాకేరు, 12న కుమ్మపల్లి, 13న నల్లబిల్లి,16న నీలకంఠ రాజపురం, 17న సింగరాయి, 18న వల్లంపూడి, 19న వావిలపాడు, 20వ తేదీన వీలుపర్తి తదితర గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరాలు నిర్వహించనున్నందున గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్దలను, రోగులను విధిగా ఆహ్వానించాలని డాక్టర్ ధరణి కోరారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ క్రాంతి పథం ఏపీఎం రొంగలి శ్రీనివాసరావు, సిహెచ్ఓ ఆంజనేయులు, హెల్త్ సూపెర్వైజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఘన సన్మానాలు



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ పిలుపుమేరకు సేవా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ పంచ ముఖాంజ నేయ స్వామి దేవాలయం వద్ద జరిగిన కార్య క్రమంలో జర్నలిస్టులకు సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి సముద్రాల నాగరాజు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలును తమ వార్తలు ద్వారా అధికారులు దృష్టిలో పెట్టి, ఆ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ప్రయతించడం గొప్ప విషయమన్నారు. ఇటువంటి జర్నలిస్టులను గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు.సీనియర్ జర్నలిస్టు సత్యావిజన్ స్టాఫ్ రిపోర్టర్ కాంద్రేగుల శేఖర్,పవర పత్రికా సంపాదకులు పంచాది అప్పారావు, సత్యావిజన్ దినపత్రిక సంపాదకులు అవనాపు సత్యనారాయణ,అక్షర బాణం రిపోర్టర్ మంత్రిప్రగడ రవికుమార్, వాజి ఛానెల్ రిపోర్టర్ రమేష్, ఎం.ఎం.ఛానల్ రిపోర్టర్ శివలను సత్కరించారు. అనంతరం సన్మానాలుకు స్పందనగా జర్నలిస్ట్‌లు మాట్లాడుతూ వాసవీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలును కొనియాడారు. ఈ కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, గుంపిన నారాయణరావు,ఏ.వి.కృష్ణారావు, కోశాధికారి ఏ.వి.ఎస్.కుమార్, అద్దా నరసింగ రావు, పెంటపాటి కామరాజు వాసవీ వనిత విజయం అధ్యక్షురాలు ప్రభ, వనిత క్లబ్ అధ్యక్షురాలు రమ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 విజేత మనోహర్‌కు సన్మానం



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : గ్రూప్ 1లో విజయం సాధించి ఆర్డీఓ గా ఎంపికైన గోపిశెట్టి మనోహర్ ను పట్టణంలోని పలు ఆర్యవైశ్య సంఘాలు సన్మా నించాయి. మంగళవారం స్థానిక శ్రీ పంచముఖాంజనేయ స్వామి దేవాలయం వద్ద శ్రీ అమరజీవి ఫౌండేషన్ మరియు పట్టణంలోని ఆర్యవైశ్య సంఘాలు సంయుక్తంగా మనోహర్ ను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీ అమరజీవి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి విజయాలను సొంతం చేసుకోవాలని, జీవితంలో ఏదైనా సాధించి, మిగిలిన వారికి స్ఫూర్తిని కలిగించాలని అన్నారు. కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి డిమ్స్ రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత మనోహర్ మాట్లాడుతూ మొదటిసారి సివిల్స్ వ్రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్ళి తిరిగి వచ్చానని, దానికి కృంగిపోకుండా మరింత పట్టుదలతో చదివి నేడు విజయం సాధించానని అన్నారు.అవసరార్థం ఏ విద్యార్థి అయినా ఫోన్ చేసి సబ్జెక్ట్ గురించి అడిగితే, చెప్పేందుకు నేను సిద్ధంగా ఉన్నానని అన్నారు. మనోహర్ తల్లిదండ్రులు గోపిశెట్టి నాగేశ్వరరావు, మంజుల మరియు బలభద్రుని నానాజీ, కుసుమంచి మహేష్, వెంకట్రావు, జి. నారాయణరావు, వంకాయల దాలయ్య శెట్టి, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, జి.ఇందిరా పాల్గొన్నారు.

జీ.ఓ జారీ - సర్వేకి దారి!

డి పట్టాల క్రమబద్ధీకరణకు జోరుగా సాగుతున్న సర్వే

పట్టాదారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

విశాలాంధ్ర - వేపాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డి పట్టా భూముల క్రమబద్ధీకరణ కోసం జారీ చేసిన జీవోతో సర్వేకి దారి కలిగింది. 20ఏళ్ళ క్రితం ఇచ్చిన డి పట్టాభూములన్నింటికీ హక్కులు కల్పిస్తూ వారి పేరున ఆన్ లైన్ చేసి అవసరాలకు అమ్ముకొనే అవకాశం కల్పించేందుకు వీలుగా సర్వే చేస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ జీవో ప్రాప్తికి మండలంలోని వీలుపర్తి పంచాయతీలో మంగళవారం సచివాలయం సర్వే సిబ్బంది గ్రామ రెవెన్యూ అధికారి బృందం రైతులను వెంటబెట్టుకొని సర్వేకి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం నుండి అందిన సమాచారం మేరకు డి పట్టాదారుల సమక్షంలో సాగులో ఉన్నారా లేదా ఉంటే ఎంతభూమికి పట్టా ఇచ్చారు అనే అంశాల ప్రా తిపదికన సర్వే జోరుగా సాగుతోంది. ఈ పంచాయతీకి సంబంధించి వీలుపర్తితో పాటు రాయుడుపేట, చామలాదేవి అగ్రహారం గ్రామాల్లో కూడా సర్వే జరపాల్సి ఉంది. కాగా సచివాలయం సిబ్బంది సర్వేవల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందున జిల్లా లేదా మండల సర్వేయర్ల సమక్షంలో సర్వే జరిపితే విస్తీర్ణం పారదర్శకంగా నమోదు అవుతుందని గ్రామానికి చెందిన రైతులు గోకేడ నాగభూషణం, గోకేడ అచ్చం నాయుడు తదితరులు కోరుతున్నారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీల నియామకానికి చర్యలు

విశాలాంధ్ర - పార్వతీపురం : కొత్త జిల్లాలకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ జిల్లా ప్రొబేషన్ అధికారి ఎం.శరత్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డుల చైర్మన్, సభ్యులు, సామాజిక కార్యకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును అక్టోబర్ 3వ తేదీ వరకు పొడిగించినట్లు, కొత్త జిల్లాలతోపాటు కృష్ణా, చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో కూడా చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జువెనైల్ బోర్డుల ఖాళీలను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 3వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హతలు, దరఖాస్తు ఫారం, అనుభవం, ఎంపిక విధానం తదితర వివరాల కోసం http://wdcw.ap.gov.in వెబ్ సైట్ ను చూడాలని ఆయన కోరారు.

7 వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



విశాలాంధ్ర - పాలకొండ : ఇందిరానగర్ కాలనీ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వి. కళావతి పాల్గొన్నారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ పరిధిలో ఇందిరానగర్ సచివాలయంలో 7 వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వి. కళావతి ని వార్డ్ ప్రజలు సాదర ఆహ్వానం పలికి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను పేద ప్రజల కొరకు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్నేనని అమె ప్రజలకు తెలిపారు. జగనన్నను మరల ముఖ్యమంత్రి చేయుటకు అందరూ కృషి చేయాలని ప్రజలను కోరారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వస్తున్న ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ప్రజలు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వారితో పాటు వైస్ ఛైర్మన్ రౌతు హనుమంతరావు, కౌన్సిలర్స్ నీలాపు శారదా శ్రీనివాసరావు, వెలమల మన్మథ రావు, కడగల అనూరాధ వెంకటరమణ, తుమ్మగుంట అనూష శంకర్ రావు, కిల్లారి.మోహన్, తూముల కళావతి లక్ష్మణరావు, భాసూరు కాంతారావు, దుప్పాడ పాపినాయుడు, కొడెం సాయికృష్ణ బాబీ, కొరికాన గంగు నాయుడు, ఆకుల కుమార్, దుంపల చిన్ని, కేశవరావు, టేకు రామకృష్ణ, పొట్నూరు దాలినాయుడు, కనకాల లక్ష్మీనారాయణ, 6 వ వార్డ్ 7 వార్డ్ పెద్దలు, నగర పంచాయతీ సిబ్బంది, వార్డ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల పై దాడి చేసింది అగంతకులు కాదు



విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : స్థానిక సర్వమంగళ దేవి పీఠంలోఉన్న గోసాలలోని గోవులపై, కృష్ణుని విగ్రహంపైన సోమవారం దాడి చేసిన వారు అగంతకులు కాదని మతిస్థిమితం లేనివ్యక్తి చేసిన పని అని పట్టణ సిఐ కృష్ణారావు తెలిపారు. మంగళవారం ఆయన పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పార్వతీపురం పట్టణంలో సర్వమంగళ దేవి పీఠంలో గోశాలలో గుర్తు తెలియని దుండగుడుగు ఆవుల పై కర్రతో కొట్టి కృష్ణుడి విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నాలు చేశాడని వివిధ చానెల్స్ లోను పత్రికలలోను వచ్చిన వార్తలు, మురపాక కాళిదాసు శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమగ్ర దర్యాప్తు జరిపిన అనంతరం సదరు వ్యక్తి మతిస్థిమితం లేని కారణంగా ఆ విధంగా ప్రవర్తించారని స్పష్టం అయిందని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.ఈ సమావేశంలో పట్టణ ఎస్సైలు దినకర్, నారాయణరావు ఉన్నారు.

ప్రత్యేక పుష్పాలంకరణ

విశాలాంధ్ర - మక్కువ : పార్వతిపురం మన్యం జిల్లా మక్కువ మండలం లోసంబర గ్రామంలో ప్రముఖ ఇలవేల్పు ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత అయిన శ్రీ పోలమాంబ అమ్మవారి ఆలయంలలో శ్రావణమాసం ఆఖరి మంగళవారం శ్రీ అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసిరి. ఈ సందర్భంగా విశేషంగా భక్తులు పాల్గొని శ్రీ అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా శ్రీ అమ్మవారి చదురుగుడినందు భక్తులు దర్శించుకుని తదుపరి వనంగుడి వద్ద అమ్మవారి వేపచెట్టు చుట్టూ ప్రదక్షిన చేసి తదువరి అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి ప్రసాదం కుంకుమ స్వీకరించిరి. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా మంచినీటి సౌకర్యం వగైరా ఆలయ కార్యనిర్వాహణ అధిగారి శ్రీ వాకచర్ల రాధాకృష్ణ ఏర్పాటు చేసిరి.

బాడ్మింటన్ మరియు సైన్స్ ఫెయిర్ పోటీలు

విశాలాంధ్ర - విజయనగరం : రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ అద్వర్యం లో బాడ్మింటన్ మరియు సైన్స్ ఫెయిర్ పోటీలు మంగళ వారం ఘనంగా జరిగాయి. ఎన్నడు లేని విధంగా బాడ్మింటన్ పోటీలకు 300 మంది హాజరు అవగా ఇండోర్ స్టేడియం వేదికగా జయకృష్ణ మంచుకొండ అశోక్ లు చైర్మన్ గా ఉత్సాహంగా పోటీలు జరిగాయి. సైన్స్ ఫెయిర్ పోటీలు ప్రైవేట్ హెూటల్ లో సురేంద్ర రెడ్డి కృష్ణతేజ అద్వర్యం లో జరగగా 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శంకర్ రెడ్డి బలభద్రుని అశోక్ ల అద్వర్యం లో కార్యక్రమాల రూపకల్పన చేయటం ఎంతో ఆనందదాయకమని ప్రెసిడెంట్ ఉడత్తు రాజేష్ కార్యదర్శి అరుణ్ సోదాని లు అన్నారు. విజేతలకు అక్టోబర్ 2 వ తేదీన బహుమతులు ఇవ్వబడతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో టిఎల్ఎన్.మూర్తి కట్టమూరి మధు పూసర్ల మారుతి తదితరులు పాల్గొన్నారు

చంద్రబాబుకి బెయిల్ రావాలని పూజలు



విశాలాంధ్ర - నెల్లిమర్ల : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి బెయిల్ రావాలని కోరుతూ టిడిపి శ్రేణులు నెల్లిమర్లలోని దుర్గాదేవి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. టిడిపి జిల్లా మహిళ అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. చంద్రబాబు ఆరోగ్యం బాగుం డాలని వారు కోరారు. కార్యక్రమంలో నగరపంచాయతీ టిడిపి అధ్యక్షురాలు బయిరెడ్డి లీలావతి, లెంక హైమావతి, కింతాడ కళావతి, బొంతు ఉమా, కోట్ల సునీత పాల్గొన్నారు.

రాజాం, బొబ్బిలిలో జగనన్నకు చెబుదాం వాయిదా

విశాలాంధ్ర - విజయనగరం : ఈ నెల 13 న రాజాం, 15 న బొబ్బిలి నియోజకవర్గ కేంద్రాల్లో జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి జిల్లా పర్యటన కారణంగా ఈ రెండు కార్యక్రమాలను వాయిదా వేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్డి అనిత తెలిపారు. మళ్ళీ ఎప్పుడు నిర్వహించేదీ తరువాత తెలియజేస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు



విశాలాంధ్ర - పాలకొండ : ఏపీపీటీడీ (ఆర్టీసీ) లో, అత్యధిక సభ్యత్వం కలిగిన యూనియన్ గా ఎంప్లాయిస్ యూనియన్ ఉన్నందున, మంగళ వారం సాయంత్రం అధికారికంగా ఎంప్లాయిస్ యూనియన్ కు ప్రభుత్వము గుర్తింపు ఇచ్చింది. ఈ గుర్తింపు ఇచ్చినటువంటి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు, రాష్ట్ర అధికారులకు, అలాగే ఆర్టీసీ ఎండి కి, ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు కి, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ రావు కి, విజయనగరం జోనల్ కార్యదర్శి బి.కె మూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాలకొండ డిపో వద్ద వివి రమణ డిపో సెక్రటరీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావు, యూనియన్ కు, గుర్తింపు వచ్చినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కార్యదర్శి బి.కె మూర్తి మాట్లాడుతూ మాకు మరింత బాధ్యతలు పెరిగాయని ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి, మేనేజ్మెంట్కు తెలియజేస్తూ సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని, ఈ గుర్తింపు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి మరియు ప్రభుత్వ అధికారులకు మరియు ఆర్టిసి ఎండి కి మరియు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు కి మరియు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రావు కి ప్రధాన కార్యదర్శి నరసయ్య కి అలాగే ఉప ప్రధాన కార్యదర్శి భానుమూర్తి కి మిగిలినటువంటి రాష్ట్ర నాయకులు కు, పాలకొండ డిపో కార్యదర్శి వివి రమణ డిపో నాయకులు మజ్జి వెంకట సూర్యనారాయణ, వై రామకృష్ణ పాత్ర, కందుల వెంకటరమణ, పైడి కృష్ణారావు కీర్తి సీతారాం, జామి శంకర్రావు, కే సందీప్ రాజు, ఎంకే రావు ,జిడి రావు, జీకే రావు, ఇప్పిలి ఆది నారాయణ, మజ్జిలింగమూర్తి, బంగారు నాయుడు, ఆనందరావు, కృతజ్ఞతలు తెలియజేశారు.

చంద్రబాబు మంచి ముత్యంలా బైటకు వస్తారు

పూజలు చేసిన మండల టీడీపీ నేతలు

విశాలాంధ్ర - జామి : తప్పుడు కేసులో జైలుకు వెళ్ళిన తమ అధినేత మంచి ముత్యంలా బైటకు వస్తారని మండల టీడీపీ నేతలు అన్నారు. మంగళవారం మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వర్రి రమణల ఆద్వర్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు కలిసి స్థానిక జామిలోని పురాతన శివాలయంలో పూజలు నిర్వహించారు. చంద్రబాబునాయుడు ఆయురా రోగ్యాలతో సుఖంగా ఉండాలని, అక్రమ కేసునుంచి బైటపడాలని కోరుకున్నారు. అలాగే సైకో ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి తమ కక్ష్యపూరిత దోరణి మరిచి, మంచి పరపాలన అందించేలా చూడాలని శివున్ని వేడుకున్నారు.ఈకార్యక్రమంలో నేతలు బొట్ట రమణ, బోని జీవన్, కొత్తలి శ్రీను, అప్పలనాయుడు, వేంద్రపు నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ అధికారి పర్యటన



విశాలాంధ్ర - బెలగాం : రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ అధికారి, స్టేట్ టిబి ఆఫీసర్ టి. రమేష్ సోమవారం, మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో గల టిబి యూనిట్ ను పరిశీలించారు. అనంతరం టిబి యూనిట్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లాలో ఎలా అమలు జరుగుతుందో పర్యవేక్షణకు విచ్చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలో ఉన్న ప్రజలందరి వద్దకు ఆశాలు, ఎఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వాటికి అవసరమగు మందులు, పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ బగాది జగన్నాధరావు, జిల్లా ఆసుపత్రి సూపరెంటెండెంట్ డా. బి. వాగ్దేవి, డిటిసిఓ డాక్టర్ శ్యామ్ కుమార్, ఎఫ్.డి.సి నోడల్ అధికారి మంతిని వినోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్, జగనన్న ఆరోగ్య సురక్ష కోసం కలవడం జరిగిందని తెలిపారు.

సంక్షేమ రాజ్యమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండలం, ఎస్.కోట -2 గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలను వెల్లడించారు. ప్రస్తుత వైఎస్సార్సీపీ ప్రభుత్వం, గత టీడీపీ ప్రభుత్వ పాలన వ్యత్యాసాలు తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు వుంటే అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటూ ముందుకుసాగారు. నేరుగా ప్రజలతో కలసి వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ ఇంకా మెరుగైన పరిపాలన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమౌతుందని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి పంపిన లేఖను అందజేస్తూ, మూడేళ్ళలో దేవుడి దయతో, మీ అందరి చల్లని చూపులతో మంచి చేసామని, ఇక ముందు కుడా మంచి చేస్తామని, మళ్లీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఇక గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్మెంట్, అమరావతి భూములు, ఫైబర్ నెట్ తదితర స్కాములతో వేల కోట్లను చంద్రబాబు, నాయకులు దోచేసారని గుర్తు చేశారు. పూర్తి స్థాయిలో స్కాములపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ పార్వతి, పోతనపల్లి వెంకటరావు, వార్డు సభ్యులు మజ్జి శేఖర్, కోసూరి భారతి, కొఠాని ఈశ్వరి, ఎస్ కోట తలారి అనంత, తిమిడి ఎంపిటిసి ధర్మారావు, రేవల్ల పాలెం రామకృష్ణ,వెంకటరమణ పేట మంచిని రామకోటి, ఆవాల కృష్ణ,సరిపల్లి గణేష్, సీతంపేట అప్పల సత్యం, మోపాడ కోటి, ఉల్లి శంకర్, ఎస్ కోట తలారి రమణ, ధర్మవరం పైడిపల్లి ,అవతారం, వీరనారాయణ ముమ్ములూరి సోంబాబు, కొట్టం భాస్కరరావు, నిరుజ్యోగి శ్రీను,ఓబులయ్య పాలెం శేఖర్, మామిడిపల్లి రమణ, ఎంపిటిసి గుమ్మడి సన్యాసప్పుడు, సీతంపేట నాగరాజు, ఎస్.జి.పేట శ్రీను, దుర్గాప్రసాద్, ఈశ్వర నాయుడు కదారి జయశంకర్, మరియు మండలంలో ఉన్న సర్పంచులు ఎంపీటీసీలు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.